జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
గురువారం | 27 | ఫిబ్రవరి | 2025 ◆ పేజీలు : 5

# పట్టభద్రుల,ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**15 జిల్లాలలో మొత్తం 773 పోలింగ్ స్టేషన్లు, కరీంనగర్లో 103**

**కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ**

**ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి**

**15 జిల్లాల బ్యాలెట్ బాక్స్ లో స్వీకరణకు సర్వం సిద్ధం**

**ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



*కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి)*

మెదక్,నిజామాబాద్, కరీంనగర్,ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఈనెల 27న జరగనున్న పోలింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు.ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారులకు సిబ్బందికి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్ పై రూట్ ఆఫీసర్లతో చర్చించారు. బ్యాలెట్ బాక్సుల లాకింగ్ సిస్టం, సీలింగ్ పై

మిగతా 2 లో...

- అధికారులను వదిలి... సిబ్బందిపై చర్యలా... !!
- 19 మంది కిందిస్థాయి సిబ్బంది తొలగింపు
- మంత్రుల పైరవితో నిలిచిన విచారణ
- అక్రమార్కులకు రాజకీయ నాయకుల అండదండలు
- అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు జాప్యం ఎందుకు... ?
- అధికారులపై వేటుపడేనా..?




# పిచ్చుకలపై... బ్రహ్మాస్త్రమా..?

2 లో..

# గ్రాడ్యుయేట్స్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం




## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

*జగిత్యాల, క్రైమ్ ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి:*

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణకు 233 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు... పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలి అని అన్నారు. జిల్లాలో స్వేచ్ఛయుత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ అన్నారు.ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు,సిబ్బందితో జిల్లా కేంద్రం లోని దేవి శ్రీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల విధులకు సంబంధించి పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ, ఎన్నికల విధులు ఏవిధంగా పకడ్బందీగా నిర్వహించాలి అని, సిబ్బంది చేయవలసిన, చేయకూడాని విధుల గురించి జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని అదే స్ఫూర్తితో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల లోనూ వదిలి వెళ్లరాదన్నారు.ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్ లు, మందుగుండు సామాగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతు లోనికి తీసుకువెళ్లారాదని, సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఉన్నతాధికారాలు ఆదేశాలు లేనిదే ఎవ్వరూ కూడా తమ విధుల నుండి వెళ్లరాదన్నారు.ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా

మిగతా 2 లో...



## గ్రాడ్యుయేట్స్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



(మొదటి పేజీ తరువాయి...)

వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన నియమాలను పక్కగా అమలు చేస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగటానికి ఆస్కారం ఉన్న వెంటనే సంబంధిత యస్.హెచ్.ఒ. లకు, రూట్ మొబైలు అధికారికి సమాచారం అంధించాలన్నారు. ఎట్టి పరిస్తుతుల్లోనూ అనాథరైజ్డ్ పర్సన్స్ పోలింగ్ స్టేషన్ లోనికి వెళ్లారాదని సూచించారు. జిల్లాలో మొత్తం (71) పోలింగ్ కేంద్రాల్లో గ్రాడ్యుయేట్స్ మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది అని దీనికి సంబంధించి (233) మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు అని అన్నారు. పటిష్టమేనా ఎస్కార్ట్ తో పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుంది (12) రూట్స్ లలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, ఇద్దరు డిఎస్పిలతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ , (6) సీఐ లతో స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్ మరియు ఎస్.ఐ లతో (18) పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## కొడిమ్యాల మండలంలో ఎమ్మెల్సీ పోలింగ్ కు సర్వం సిద్ధం

★ మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 2122

★ టీచర్ ఓటర్లు 35



*కొడిమ్యాల,ఫిబ్రవరి 26,(ప్రజాజ్యోతి):*

కరీంనగర్,ఆదిలాబాద్,నిజామాబాద్,మెదక్ గ్రాడ్యుయేట్ ,టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కొడిమ్యాల మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో మొత్తం 2122 గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా,టీచర్ ఓటర్లు 35 మంది ఉన్నారు.వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.పోలింగ్ కేంద్రంలో 9 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

## శివరాత్రి సందర్భంగా శివ కళ్యాణం

*జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి).*



హౌసింగ్ బోర్డ్ శక్తి గణపతి ఆలయంలో శివరాత్రి సందర్భంగా శివ కళ్యాణాన్ని భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మరియు పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పట్టభద్రుల,ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి...)

మరోసారి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 3లక్షల 55 వేల 159 ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారని తెలిపారు. అన్ని జిల్లాలలో కలిపి 499 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 274 టీచర్స్ పోలింగ్ స్టేషన్లో ఉన్నాయని వివరించారు. 93 కామన్ పోలింగ్ స్టేషన్లు ( గ్రాడ్యుయేట్స్, టీచర్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తంగా అన్ని జిల్లాల్లో 773 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

### కరీంనగర్ జిల్లాలో...

కరీంనగర్ జిల్లాలో 71 వేల 545 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 4 వేల 305 మంది టీచర్స్ ఓటర్లు ఉన్నారు.మొత్తం 103 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరుగుతుందని, ఇందులో 85 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు కాగా, 18 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ డివిజన్లో వారీగా పరిశీలిస్తే కరీంనగర్ రెవెన్యూ డివిజన్లో 69 గ్రాడ్యుయేట్, 12 టీచర్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. హుజరాబాద్ రెవెన్యూ డివిజన్లో 16 గ్రాడ్యుయేట్ 6 టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని అన్నారు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 103 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 312 మంది పోలింగ్ ఆఫీసర్లు, 36 మంది రిజర్వు సిబ్బంది, మొత్తం 451 మంది పోలింగ్ విధుల్లో ఉన్నారని తెలిపారు. జిల్లాలో 36 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది సెక్టార్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసేందుకు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక దానిని చూపించి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఈ నెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ సెంటర్ కు తరలిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతతో 144 సెక్షన్ అమలు ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాల నిఘా తో పాటు కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

### ప్రత్యేక సెలవు...

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు తమ ఓటు వినియోగించుకునేందుకు ప్రత్యేక సెలవు వర్తిస్తుందని తెలిపారు.వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని కోరారు.ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, ఇతర జిల్లా అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

# పిచ్చుకలపై... బ్రహ్మాస్త్రమా..?

*హుజురాబాద్, ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి :*

కొండను తవ్వి ఎలకను పట్టుకున్న చందంగా మారింది జిల్లాస్థాయి అధికారుల పరిస్థితి. గత రెండు వారాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ సాగుతున్న చర్యలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. నేరం ఒకరు చేస్తే శిక్ష మరొకరికి పడ్డట్టుగా అధికారుల చర్యలు ఉన్నాయి. వేల గొడ్లను తిన్న రాబందు ఒక గాలివానకు పడ్డట్టు ఈ విచారణతో అక్రమార్కుని పై వేటు పడుతుందని భావించిన హుజురాబాద్ ప్రాంత ప్రజల ఆశలు అడియాశలుగా మిగిలాయి. అధికారులు చెప్పిన మాటలను తూచా తప్పకుండా పాటించిన కింది స్థాయి సిబ్బందిపై వేటుపడడం, అధికారులను వదిలేయడం పట్ల హుజురాబాద్ ప్రాంతం లో సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. చట్టం దృష్టిలో అందరూ సమానమే అని అంటారు. కానీ చట్టం డబ్బులున్నా వారి చుట్టంగా మారిందేమోనని అనుమానాలకు ఈ సంఘటన ఊతమిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రతి అవినీతి అక్రమాలకు కేంద్రబిందువైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి చుట్టుపక్కల ఒక్క



ప్రజాజ్యోతి

11 Feb 2025 - Page 1



ప్రైవేట్ అంబులెన్స్ కనిపించేదే కాదు. కానీ సదరు అధికారి వచ్చిన నాటి నుండే ఈ అక్రమ దందాకు తెర తీశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను వివిధ కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించేందుకు సదరు అధికారి చేసిన చర్యల మూలంగానే ఆసుపత్రిలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది సైతం అదే చర్యలకు పూనుకున్నట్లు తెలిసింది. అయినప్పటికీ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం ఏంటనే ప్రశ్నలు పట్టణంలో షికారు కొడుతున్నాయి.

### - 19 మంది సిబ్బంది తొలగింపు

హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న అక్రమాలపై ప్రజా జ్యోతి దినపత్రికలో " పేరుకే పెద్దాసుపత్రి "అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన జిల్లా యంత్రాంగం గత పది రోజులుగా ఈ విషయంపై విచారణ చేసి అందుకు బాధ్యులైన 19 మంది సిబ్బందిని తొలగిస్తూ ఆయా ఏజెన్సీలకు నోటీసులు జారీ చేసింది. ఆస్పత్రిలో పనిచేసే 9 మంది సెక్యూరిటీ గార్డ్స్, నలుగురు టెక్నికల్ డిపార్ట్మెంట్, ముగ్గురు సూపర్వైజర్లు, ముగ్గురు ఎం ఎం ఓ లను తొలగించాలని ఆయా ఏజెన్సీలకు నోటీసులు పంపారు.

### - మంత్రుల పైరవితో నిలిచిన విచారణ

.ఆసుపత్రిలో జరిగే అక్రమాలపై విచారణ చేపట్టిన జిల్లా స్థాయి అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. అక్రమార్కులను మంత్రులు తమ కబంధ హస్తాల కింద కాచుకోవడమే ఇందుకు కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన వారే అక్రమార్కులకు అండగా ఉండటంతో సామాన్య ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని పలువురు భిన్న స్వరాలు వినిపిస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి వద్దకు సదరు అధికారి మెల్లగా తాము ఈ విషయంలో ఏం చేయలేమని కరాకండిగా చెప్పినట్లు సమాచారం. మరో మంత్రి వద్ద కు వెళ్లి తనపై చర్యలు తీసుకోకుండా నిలిపి వేసే విధంగా చూడాలని చెప్పడంతో సదరు మంత్రి జిల్లా స్థాయి అధికారులపై ఒత్తిళ్లు తీసుకురావడంతోనే ఆ అధికారి సస్పెన్షన్ నిలిచిపోయిందని హుజురాబాద్ లో జోరుగా ప్రచారం సాగుతుంది. ఇప్పటికైనా మంత్రులు అక్రమార్కులకు వత్తాసు పలకకుండా వారిపై చర్యలు తీసుకొని ప్రజల మన్ననలు పొందాలని హుజురాబాద్ ప్రజలు కోరుకుంటున్నారు. ఇలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోను కాకుండా అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# శేర్లింగంపల్లిలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

★ ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్నూరు కాపు జూబ్లీహిల్స్ నియోజకవర్గం కోఆర్డినేటర్ వాసాల రాజు పటేల్



**చిగురుమామిడి ఫిబ్రవరి 26(ప్రజా జ్యోతి )**

శేర్లింగంపల్లి మండలం న్యూ హాఫీజ్పేట్ ప్రేమ్ నగర్ రామలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ప్రాతకాలము నుండి పంచామృత అభిషేకాలతో,పూలు పండ్లతో, ఏక బిల్వపత్రాల అర్చనలతో, శివనామ స్మరణతో పురవీధులన్నీ మారు మ్రోగుతూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గం కోఆర్డినేటర్ వాసాల రాజు పటేల్, శ్రీమూర్తి శ్రీనివాస్ పటేల్, మార్తండనగర్ వార్డ్ మెంబర్ శ్రీనివాస్ చౌదరి,సకుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహి నిర్వహించారు.ఆలయ చైర్మన్ గోపి కృష్ణ నాగరాజు–శారద యాదవ్ మాట్లాడుతూ గత 30సంవత్సరాలుగా ఈ రామలింగేశ్వర ఆలయంలో ప్రాంతీయ భేదాలకు అతీతంగా మార్వాడీలు,మరాఠీలు, కన్నడీలు, రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు ఎంతో మంది భక్తులు అత్యధిక సంఖ్యలో భగవంతుని దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమంలు నిర్వహిస్తారని తెలియజేసినారు.రానున్న కాలంలో ఈ రామలింగేశ్వర ఆలయాన్ని అభివృద్ధి పరిచి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో గోపి కృష్ణశ్రీకాంత్, సుశీల, శ్రీనివాస్ గౌడ్, స్వప్న, బన్నప్ప, శేఖర్, శివరాజ్, రేఖమ్మ, సతీష్, అశ్విన్, సురేష్, కోలిపల్లి శ్రీకాంత్ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాశివరాత్రి వేడుకలు







**పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి ), ఫిబ్రవరి 26 :**

మహాశివరాత్రి వేడుకలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యంత ఘనంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు తరలివచ్చి మహాశివుడి దర్శనం చేసుకొని మొక్కులు చెల్లిస్తున్నారు. ఆలయాల్లో స్వామి వారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శివనామస్మరణతో శివాలయాలు మారు మోగాయి. ఆలయాల వద్ద ఏలాంటి ఇబ్బందులు భక్తులు ఎదుర్కోకుండా పెద్ద ఎత్తున ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.వేములవాడతో పాటు ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు స్వామి వారి దర్శనం కోసం నాలుగు నుండి ఆరుగంటల సమయం పడుతుంది. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. పెద్దపల్లి శివాలయంలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ఇల్లందుల కృష్ణమూర్తి, నాళ్ళ విశ్వనాథ్, దక్షిణామూర్తి, అల్లంకి శ్రీనివాస్ తో పాటు పలువురు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాలోని పలు శివాలయాల్లో మహాశివుడిని దర్శించుకున్నారు. పెద్దపల్లి ఎంపీ వంశీ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎంపీని ఘనంగా సత్కరించారు.

## చెడు పాప కర్మలను కరిగించేదే శివరాత్రి జాగరణ





### శివరాత్రి జాగరణ విశిష్టత

### శివరాత్రి జాగరణ, ఉపవాసం ఎంత మహిమాన్వితమైనది

**జగిత్యాల, ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి ).**

శివరాత్రి భారతీయులకు ఎంతో ప్రత్యేకమైన దినం ఈరోజు ప్రతి శివాలయంలో శివోహం అనే మాటలతో భక్తి పారవశ్యంలో మునిగిపోతారు భక్త జనులందరూ ప్రతి పట్టణా, గ్రామాలలో శివాభిషేకాలు, శివపార్వతుల కళ్యాణం, పురాణాల పారాయణ, పురాణ శ్రవణం మొదలైనవి అన్నీ చాలా వైభవంగా జరుపుకుంటారు. నిరాడంబరుడు అయిన శివుడు శివరాత్రి ఎంతో గొప్పగా పూజలు అందుకుంటాడు. ఇకపోతే శివరాత్రి రోజు ఉపవాసం, జాగరణకు చాలా ప్రాముఖ్యత ఉంది. శివరాత్రి రోజు చేసే ఉపవాసం, జాగరణలు ఎంత శక్తివంతమైనవో తెలిపే ఒక పురాణ కథ ఉంది . దాని గురించి లక్ష్మీ నరసింహ స్వామి ఉపవాసకులు పూర్ణచంద్ర ఆచార్యులు తెలుపుతూ గుణనిధి అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఇతను పుట్టడానికి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా ఇతనికి ఏ ఆచారాలు పాటించక చాలా నిర్లక్ష్యంగా ఉండేవాడు. అతనికి లేని చెడ్డ అలవాటు అంటూ లేదు ఏ రకంగా చూసినా అతను బ్రాహ్మణ కులాన్ని భ్రష్టు పట్టించాడు అనే వారు. ఇంత చెడ్డ అలవాట్లు కలిగిన గుణనిధి ఒక శివరాత్రి రోజు తన ప్రమేయం లేకుండానే తనకు ఎక్కడా ఆహారం దొరకక ఆ రోజంతా ఏమీ తినకుండా ఉన్నాడు. అతను అలా తినకపోయేసరికి అదే శివరాత్రి ఉపవాసం అయ్యింది.ఆహారం ఎక్కడా దొరకక పోవడంతో అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఈ రోజు శివరాత్రి కదా. కనీసం గుడిలో ప్రసాదం దొరుకుతుందేమో అని శివాలయానికి వెళ్లాడు. చీకటిలో ఏదైనా తినడానికి వెతుకుదామని అతను దీపం వెలిగించాడు.అదే శివాలయంలో కొందరు భక్తులు జాగారం చేస్తుండటం అతను గమనించి భయపడతాడు. అక్కడే బిక్కుబిక్కుమని దాక్కుని నిద్రలేకుండా గడుపుతాడు. అక్కడి నుండి పారిపోవాలని ప్రయత్నించి ఊహించని విధంగా ఆ శివాలయంలోనే ప్రాణాలు పోగొట్టుకుంటాడు.అతని ప్రమేయం లేకుండానే ఉపవాసం, జాగరణ ఉండటమే కాకుండా.. శివాలయంలోనే ప్రాణాలు పోగొట్టుకోవడంతో అతని పాపాలన్నీ నశించి శివసాయుజ్యం పొందుతాడు.ఆ నాడు శివాలయంలో మరణించిన గుణనిధి మరుసటి జన్మలో నిధులకు అధిపతి అయిన కుబేరునిగా జన్మిస్తాడు. తెలియక శివరాత్రి జాగరణ, ఉపవాసం చేసినందుకే శివుడు ఇంత కరుణ చూపిస్తే.భక్తి శ్రద్దలతో శివరాత్రి జాగరణ చేస్తే ఆ పరమేశ్వరుడు ఇంకెంత కరుణ చూపిస్తాడో ఎవ్వరూ ఊహించలేరు.అందుకే శివరాత్రి ఉపవాసం, జాగరణ అనేవి జన్మ పాపాలను, చెడు కర్మల పాపాలను కరిగించేవి.వాటిని అందరూ విదిగా పాటిస్తే ఎంతో మంచిది అని ఈ శివరాత్రి జాగరణ యొక్క విశిష్టతను భక్తుల అందరికీ పూర్ణ చంద్రాచార్యులు క్లుప్తంగా వివరించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ద్విముఖ పోటీ

ప్రచారంలో కాంగ్రెస్ ముందంజ

నామమాత్రంగా బిజెపి ప్రచారం





**కాల్వ శ్రీరాంపూర్ ,(ప్రజా జ్యోతి ) ఫిబ్రవరి 26 :**

నేడు జరగబోయే మెదక్ కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ అభ్యర్థి అంజిరెడ్డి జాతీయ పార్టీ అయినప్పటికీ కేంద్రంలో ప్రతిపక్ష పార్టీలో ఉండి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ స్పోర్ట్స్ పాఠశాలల అధినేత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మధ్య ద్విముఖపోటీ నెలకొంది నెలకొంది బిజెపి పార్టీ అభ్యర్థి అంజిరెడ్డి మేం దేశంలో అధికారంలో ఉన్నామని సమస్యలను పరిష్కరించడం సాధ్యమవుతుందని పట్టభద్రులకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉందని నేను గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తానని వివరిస్తూ ప్రచారంలో ముం దుకు దూసుకుపోతున్నాడు ఈయన విజయం కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేస్తుండగా బిజెపి పార్టీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం కోసం నాయకులు కార్యకర్తలు పెద్దగా ప్రచారం చేసినట్లు కనబడడం లేదు కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి పార్టీ ప్రచారం చేయకపోవడం ఏమిటని ఆ పార్టీ శ్రేణులే విమర్శిస్తూ నిరుత్సాహానికి లోనైనట్టు కనబడుతుంది ఏదేమైనా పట్టబద్రులు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓట్లేసి గెలిపించునో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి కి ఓట్లేసి గెలిపించునో వేచి చూడాల్సిందే.

## గెలుపుకు చేరువలో ట్రస్మా అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి )**

పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రచారంలో ముందు ఉంటూ తనకి జరిగిన యాక్సిడెంట్ ని కూడా లెక్కచేయకుండా సమాజ శ్రేయస్సుకై ప్రతి ఒక్కరిని కలుసుకుంటూ సమాజం పట్ల పట్టభద్రుల పట్ల వారి సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా మరియు వారి సమస్యల పై పోరాడే వ్యక్తిగా ఆదరణ పొం దుతున్నారు మేజర్ యాక్సిడెంట్ అయిన ఆ దేవుని ఆశీర్వాదం మరి యు పట్ట భద్రులకు సేవ చేయాలని మంచి ఉద్దేశంతో వీల్ చైర్ లో ఉండి కూడా పట్ట భద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. బిజినెస్ మ్యాన్ కు సర్వీస్ మ్యా నుకు జరుగుతున్న ఈ ఎలక్షన్లో విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. పట్టబద్రులు తన వెంటే ఉన్నారని అన్నారు తన గెలిచిన తర్వాత వచ్చే 72 నె లల జీతం మొత్తాన్ని పట్టభద్రుల అభివృద్ధికై రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా పట్టభద్రుల అభివృద్ధికి ఖర్చు చేస్తానని అని ప్రకటించిన ఒకే ఒక వ్యక్తి పట్టబద్రుల స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎస్సై వెంకటేష్



**కాల్వ శ్రీరాంపూర్ (ప్రజాజ్యోతి ), ఫిబ్రవరి 26**

కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని పెగడపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసు లు బుధవారం రోజున దాడి చేశారు ఏడుగురు పేకాట ఆడుతుండగా ఇద్దరు పట్టుబడ్డారు మిగతా ఐదుగురు పారిపోయారు పట్టుబడిన వారి నుండి సుమా రు30 వేల చిల్లర డబ్బులు ఆరు బైకులు మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు.

## పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ ల తరలింపు

: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్





**జగిత్యాల, క్రైమ్ ఫిబ్రవరి26, ప్రజా జ్యోతి:**

పట్టభద్రుల , ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా జిల్లా కేంద్రం లోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్& రిసెప్షన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ శ్రీ సత్య ప్రసాద్ ఐఏఎస్ తో కలిసి ఎస్పీ అశోక్ కుమార్ సందర్శించారు. ఈ యొక్క డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రి పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య తరలించడం జరిగిందని ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూటు మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

## శివయ్యకు లక్ష గోగు పువ్వులతో పుష్పార్చన

**జగిత్యాల, ఫిబ్రవరి26, (ప్రజాజ్యోతి ).**



జగిత్యాల పట్టణంలోని శివ పంచయత్ లక్ష్మీ నరసింహస్వామి స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు లక్ష్మీ నరసింహ స్వామి ఉపసకులు శ్రీ పూర్ణచంద్ర చార్యుల ఆధ్వర్యంలో శివయ్యకు లక్ష గోగు పూలచే పూలభిషేకంను ఆలయ కమిటీ వారిచే భక్తుల మధ్య నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, భక్తులు పాల్గొని గోగార్చన పుష్పాభిషేకాన్ని విజయవంతం చేశారు.

## శివరాత్రి సందర్భంగా 24 గంటల శివనామ గాన స్వరాభిషేకం



**జగిత్యాల, ఫిబ్రవరి26, (ప్రజాజ్యోతి ).**



జగిత్యాల పట్టణంలోని వాణినగర్ లోగల ధర్మశాల లోని ఆలయంలో దృఢ నిశ్చల మహాసంకల్ప శివ గాన స్వరాభిషేకం ను నిర్వహించారు ఈ కార్యక్రమంను శివరాత్రి సందర్భంగా భక్తుల మధ్యలో 24 గంటల నిర్విరామ గాన స్వరాభిషేకం ను డా:నక్కరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ స్వరాభిషేకం ను త్రయోదశి వసంతలలో 7వ సారీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.

# అర్జీవన్ లో స్ట్రక్చర్ సమావేశం

### యాజమాన్యం దృష్టికి పలు సమస్యలు

### త్వరలో పరిష్కరిస్తామని జీఎం హామీ

**గోదావరిఖని , ఫిబ్రవరి 26 (ప్రజాజ్యోతి )**



గోదావరిఖని సింగరేణి ఆర్జీవన్ జియం కార్యలయంలో బుధవారం సాయంత్రం సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ప్రతినిధులతో జీఎం స్థాయి స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు.ఆర్జీ1 జీఎం డి.లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సంస్థ గుర్తింపు కార్మిక సంఘం జీఎం కమిటీ సభ్యులతో పాటు ఆర్జీవన్ ఏరియా వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.గత నెలలో జరిగిన నిర్మాణాత్మక సామావేశంలో తీసుకున్న నిర్ణయాలు కొన్ని పరిష్కారం అయ్యాయని,మరికొన్ని మిగిలిపోయాయని,అన్నింటికి సానుకుల వాతావరణంలో పరిష్కారం జరుగుతాయని జీఎం తెలిపారు. గుర్తింపు సంఘం ప్రతినిధులు వివిధ సమస్యలు పై చర్చించారు.జీడికె వన్ ఇంక్లైన్లో సర్ఫేస్ నుండి అండర్ గ్రౌండ్ లోకి వెళ్ళే కార్మికులకు అన్ని డిస్ట్రిక్ట్ లకు టెలిఫోన్ సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడుతున్నారని,వెంటనే ఫోన్ సౌకర్యం కల్పించాలని,ఆర్జీవన్ లో టెండాల్ యాక్టింగ్ చేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికులకు టెండాల్ యాక్టింగ్ భత్యం చెల్లించాలని,వారికి ప్రమోషన్లు ఇవ్వాలని,జీడీకే 11వ ఇంక్లైన్లో రాణా రూప్ బోల్టర్స్ డ్రిల్ రాడ్స్,డ్రిల్ బిట్లు హోల్ రిటన్ ఇచ్చిన బిట్లకు రంగులు వేసి కొత్తవి అని చెప్పి ఇస్తున్నారని ,మంచి కంపెనీ బిట్లు, రాడ్స్ కొత్తవి ఇవ్వాలని,జీడీకే 11వ ఇంక్లైన్లో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే వారిని వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్లడానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని,ఓసిపి 5 లో ఆపరేటర్ల కొరత ఉందని, ఏ గ్రేడ్ వచ్చిన వాళ్లను ట్రాన్స్ఫర్ చేయకుండా ఓసీపీ 5 లోనే ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని,సి ఎస్ పి వన్ లో ట్రిప్పర్ ట్రాలీ కి చెందిన ఛూట్స్,రెయిల్స్ పనికి రాకుండా ఉన్నాయని, వాటిని వెంటనే మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని,ఏరియా హాస్పిటల్ లో ఇస్తున్న మందులు ఎల్ వన్ రేట్ లోకాస్ట్ కాకుండా,కార్పొరేట్ హాస్పిటల్ టారీప్ తో కూడిన మందులు ఇవ్వాలని,ఆర్జీవన్ లో సివిల్ డిపార్ట్మెంట్ కు చెందిన ఇంటెక్ వెల్ తో పాటు అన్ని ఏరియాల్లో ఉన్న వాటర్ ట్యాంకు ల వద్ద లైటింగ్ సౌకర్యం కల్పించాలని, సివిల్ డిపార్ట్మెంట్ లో పిట్టర్లు,క్లర్క్ ల ఖాళీలను భర్తీ చేయాలని,ఆర్జీవన్ లో ఉన్న ఆర్వో ప్లాంట్ లను బాగు చేయాలని,గాంధీ నగర్లో ప్లాంటు, తిలక్ నగర్ లో ఆర్వో ప్లాంట్ లు పనిచేయడం లేదన్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి జనగామలో ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను వెంటనే దానిని ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని,కాంట్రాక్టు కార్మికులకు ఎక్కువ క్యాటగిరి లో పని చేస్తున్న వారికి అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తున్నారని, దీని వల్ల వారు ఆర్థికంగా నష్టపోతున్నారని,సెమీ స్కిల్డ్,హై స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని,కాంట్రాక్టు కార్మికులు అత్యవసర సమయాల్లో విధులకు హాజరు కాకుంటే వారికి నాగా పేరుతో పెనాల్టీ విధించే విధానం రద్దు చేయాలని జీఎం కు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని జీఎం హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య,సెంట్రల్ సెక్రటరి స్వామి,రంగు శ్రీనివాస్, యస్.ఓ.టు జీఎం గోపాల్ సింగ్,డిజియం పర్సనల్ కిరణ్ బాబు,అధికారులు చంద్ర శేఖర్,కిరణ్ రాజ్ కుమార్,జితేందర్ సింగ్, వర ప్రసాద్, రమేష్,రవీందర్ రెడ్డి,వీరారెడ్డి, శ్రావణ్ కుమార్, హన్మంత రావు,ఎఐటియు సి జీఎం కమిటీ సభ్యులు మాదన మహేష్,వెంకట రెడ్డి,మల్లిఖార్జున్, మిట్ట శంకరయ్య పాల్గొన్నారు.

# మహా శివరాత్రి విశిష్టత





**జగిత్యాల్ టౌన్,ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి ).**

మహా శివరాత్రి పర్వదినాన్ని నిష్ఠతో ఓ వ్రతంలా చేసుకోవటం పురాణకాలం నుండి ఆచారంగా వస్తోంది. ఈ వ్రతం చేసేవారి చెంతన శివయ్య నిరంతరం చింతలు తీరుస్తాడు అనేది ప్రజల ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఇదే వ్రతాన్ని నిష్కామ దృష్టితో చేసే వారికి ముక్తి లభిస్తుంది. కేవలం మహాశివరాత్రి నాడే కాక ఈ వ్రతాన్ని సంవత్సరంలో ప్రతి మాసశివరాత్రి నాడు చేసి ఆ తరువాత ఉద్వాసన విధిని ఆచరించిన వారికి అనంత పుణ్యఫలం లభిస్తుంది. భక్తి, ముక్తి సొంతమవుతాయి. ఇంతటి పుణ్యఫలప్రదమైన ఈ వ్రతాన్ని గురించి చెప్పింది ఎవరో కాదు సాక్షాత్తూ ఆ శివుడే.ఓసారి బ్రహ్మ, విష్ణువు, పార్వతీ నేరుగా శివుడినే ఏ వ్రతం చేస్తే మానవులకు శివుడు భక్తిని, ముక్తిని కలిగించటం జరుగుతుందని ప్రశ్నించారు. అప్పుడు ఆ పరమేశ్వరుడు చేసిన వారికే కాక చూసిన వారికీ, విన్నవారికీ కూడా పాప విముక్తిని కలిగించే శివరాత్రి వ్రతాన్ని గురించి, దాన్ని ఆచరించాల్సిన పద్ధతి గురించి తెలియచెప్పాడు. భక్తిని, ముక్తిని మానవులకు కలిగించే శివ సంబంధ వ్రతాలు చాలా ఉన్నాయి.జాబాల శ్రుతిలో రుషులు పది శైవవ్రతాలను గురించి చెప్పారు.శివపూజ, రుద్రజపం, శివాలయంలో ఉపవాసం, వారణాసిలో మరణం అనే నాలుగు సనాతనమైన ముక్తి మార్గాలు, అష్టమి తిథితో కూడిన సోమవారం, కృష్ణపక్షం నాటి చతుర్ధశి శివుడికి ఎంతో ప్రీతికరం.ఇవన్నీ ఓ ఎత్తైతే శివరాత్రి వ్రతం అన్నిటికంటే గొప్పది. ఎలాగో ఒకలాగా మనిషి పట్టుపట్టి ఈ వ్రతాన్ని చెయ్యటం మంచిది. ధర్మసాధనలన్నిటిలో ఉత్తమమైనదని దీనికి పేరు. ఏ భేదమూ లేకుండా సర్వవర్ణాలవారు, అన్ని ఆశ్రమాలవారు, స్త్రీలు, పిల్లలు ఒకరనేమిటి దీన్ని ఎవరైనా చేసి మేలు పొందవచ్చు.మాఘమాసం కృష్ణపక్షంలో ఈ వ్రతం చేయటం శ్రేష్ఠం.రాత్రి అంతా ఈ వ్రతాన్ని చేయాలి. శివరాత్రి పూట ఉదయాన నిద్రలేవగానే శివుడి మీదనే మనస్సును లగ్నంచేయాలి. శుభ్రంగా స్నానం చేశాక శివాలయానికి వెళ్ళి శివపూజను చేసి సంకల్పం చెప్పుకొని పూజాద్రవ్యాలను సమకూర్చుకోవాలి. ఆ రాత్రికి ప్రసిద్ధమైన శివలింగం ఉన్న చోటికి వెళ్ళి సమకూర్చుకొన్న పూజాద్రవ్యాలను అక్కడ ఉంచాలి. ఆ తర్వాత మళ్ళీ స్నానం, లోపల, బయట అంతాపరిశుభ్ర వస్త్రధారణలతో శివపూజకు ఉపక్రమించాలి. శివాగమ ప్రకారం పూజను చేయటం మంచిది. దీనికోసం ఉత్తముడైన ఆచార్యుడిని ఎంచుకోవాలి. ఏ మంత్రానికి ఏ పూజాద్రవ్యాన్ని వాడాలో ఆ క్రమంలోమాత్రమే పూజ చేయాలి. మంత్రం లేకుండా పూజించకూడదు.భక్తి భావంతో గీత, వాద్య, నృత్యాలతో ఇలా ఆ రాత్రి తొలి యామం(జాము) పూజను పూర్తిచేయాలి.శివ మంత్రానుష్ఠానం ఉన్నవారు పార్థివ లింగాన్ని పూజించాలి. ఆ తర్వాత వ్రతమాహాత్మ్య కథను వినాలి. ఈ పూజ నాలుగు జాములలోనూ ఆ రాత్రి అంతా చెయ్యాల్సి ఉంటుంది. వ్రతానంతరం యధాశక్తిగా పండితులకు, శివభక్తులకు విశేషించి సన్యాసులకు భోజనాన్ని పెట్టి సత్కరించాలి. నాలుగు జాములలో చేసే పూజ కొద్దిపాటి భేదంతో ఉంటుంది. తొలి జాములో పార్థివ లింగాన్ని స్థాపించి పూజించాలి. ముందుగా పంచామృతాభిషేకం, ఆ తర్వాత జలధారతో అభిషేకం నిర్వహించాలి.చందనం, నూకలు లేని బియ్యం, నల్లని నువ్వులతో పూజచేయాలి. ఎర్రగన్నేరు, పద్మంలాంటి పుష్పాలతోఅర్చించాలి. భవుడు, శర్వుడు, రుద్రుడు, పశుపతి, ఉగ్రుడు, మహాన్, భీముడు, ఈశానుడు అనే శివదశ నామాలను స్మరిస్తూ ధూప దీప నైవేద్యాలతో అర్చన చేయాలి. అన్నం, కొబ్బరి, తాంబూలాలను నివేదించాలి. అనంతరం ధేను ముద్రను చూపి పవిత్ర జలంతో తర్పణం విడవాలి. అనంతరం అయిదుగురు పండితులకు భోజనం పెట్టడంతో తొలిజాము పూజ ముగుస్తుంది.రెండోజాములో తొలిజాముకన్నా రెట్టింపు పూజను చేయాలి. నువ్వులు, యవలు, కమలాలు పూజా ద్రవ్యాలుగా ఉండాలి. మిగిలిన పద్ధతంతా తొలిజాములాంటిదే.మూడో జాములో చేసే పూజలో యవల స్థానంలో గోధుమలను వాడాలి. జిల్లేడు పూలతో శివపూజ చేయాలి. వివిధ ధూపదీపాలను. శాకపాకాలను, అప్పాలను నివేదించాలి. కర్పూర హారతిని ఇచ్చిన తర్వాత దానిమ్మ పండుతో అర్ఘ్యం ఇవ్వాలి. పండిత భోజనాలన్నీ అంతకు ముందులాగే ఉంటాయి.నాలుగోజాములో పూజాద్రవ్యాలుగా మినుములు, పెసలు లాంటి ధాన్యాలను,శంఖ పుష్పాలకు, మారేడు దళాలను వాడాలి. నైవేద్యంగా తీపి పదార్థాలను కానీ, మినుములతో కలిపి వండిన అన్నాన్నీ కానీ పెట్టాలి. అరటిపండు లాంటి ఏదో ఒక ఉత్తమమైన పండుతో శివుడికి అర్ఘ్యం సమర్పించాలి. ఇలా భక్తి పూర్వకంగా నాలుగు జాములలోనూ ఒక ఉత్సవంలాగా శివరాత్రి వ్రతాన్ని చేయాల్సి ఉంటుంది. ఏ జాముకుఆ జాము పూజ పూర్తికాగానే ఉద్వాసన చెప్పటం, మళ్ళీ తరువాతి జాము పూజకు సంకల్పం చెబుతుండాలి. నాలుగు జాముల శివరాత్రి వ్రతం ముగిశాక పండితులకు పుష్పాంజలి సమర్పించి వారి నుండి తిలకాన్ని, ఆశీర్వచనాన్ని స్వీకరించి శివుడికి ఉద్వాసన చెప్పాలి. ఈ వ్రతక్రమాన్ని శాస్త్రం తెలిసిన ఆచార్యుడి సహాయంతో క్రమం తప్పకుండా చేయటం మంచిది. ఇలా చేసిన భక్తుల వెంట తాను నిరంతరం ఉంటానని సర్వశుభాలు, సుఖాలు కలిగిస్తానని శివుడు బ్రహ్మ, విష్ణు, పార్వతులకు వివరించి చెప్పాడు. ఈ కథా సందర్భం వల్ల యుగయుగాలుగా శివరాత్రి వ్రతం ఆచరణలో ఉందన్న విషయం స్పష్టమవుతుంది.

# వేలాల మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన సిపి





**జిల్లా ప్రతినిధి పెద్దపల్లి ఫిబ్రవరి 26,(ప్రజా జ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ జైపూర్ మండలం వేలాల మల్లికార్జున స్వామి ని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,.., లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం సీపీ మాట్లాడుతూ..... మహాశివరాత్రి సందర్భంగా వేలాల జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖ ల సమన్వయం తో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జాతరకి వచ్చిన భక్తులు వంట వండుకోవడానికి వెలిగించిన పొయ్యిలు వంట అయిపోగానే వెంటనే ఆర్పీ వేయాలి. అదేవిదంగా బోనాలు వండి దీపాలు పెట్టడం జరుగుతుంది చుట్టూ ఎండిన గడ్డి ఎండిన ఆకులు ఉన్నాయి కావున అనుకోని ప్రమాదం జరిగే అవకాశం ఉంది గనుక జాగారం ఉండేవారు తప్పకుండా తెలివితో ఉండి దీపాలను గమనిస్తూ ఉండాలని, ఈ విషయం లో ప్రజలు కూడా సహకరించాలని సిపి భక్తులకు ప్రజలకు సూచించారు. ఆలయంలో దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాం టి ఇబ్బంది తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి వరుస పద్ధతిలో అనుమతించడం జరుగుతుందని, దర్శనం కి వచ్చి వెళ్లే ప్రజలకు ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ప్రజ లు, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవుని శీఘ్ర దర్శనం జరిగింది అని ఒక మంచి అనుభూతి తో ఆనందం గా వెళ్లే లాగా చూడాలి అని అధికారులకు సూచించారు. వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ నిర్వహించడం జరిగింది అని తిరిగి వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కాకుండా చూడాలని అధికారులకు సూచించారు అన్నారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, సీఐ శ్రీరాంపూర్ వేణు చందర్, ఆర్ ఐ సంపత్, ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ పోలీస్

## – వికలాంగుని ఎత్తుకొని శివయ్య దర్శనం చేయించిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రాజు



**జగిత్యాల రూరల్,ఫిబ్రవరి 26, (ప్రజాజ్యోతి)** పెంబట్ల దుబ్బ రాజన్న స్వామి జాతరలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజు తన మానవత్వాన్ని చాటుకున్నారు. దుబ్బ రాజన్న స్వామి దర్శనానికి వచ్చిన ఓ వికలాంగుడు దర్శనం చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ సన్నివేశాన్ని గమనించిన హెడ్ కానిస్టేబుల్ రాజు ఆ వ్యక్తి దర్శనం చేసుకోవడానికి వీలు లేని విధంగా ఉండడంతో ఇది గమనించిన హెడ్ కానిస్టేబుల్ రాజు చంటి పిల్లోడు గా భుజాలపై వికలాంగుడికి ఎత్తుకొని దేవుడి దర్శనం చేయించారు, మానవత్వంతో అతని పక్కకు వెళ్లి, ఆ వికలాంగుని భుజాలపై ఎత్తుకొని స్వామి దర్శనానికి తీసుకెళ్లారు. ఈ సహాయం వలన ఆ వ్యక్తి ఎంతో ఆనందంతో స్వామి దర్శనాన్ని పొందగలిగాడు. అక్కడ ఉన్న స్థానికులు శభాష్ పోలీస్ అంటూ మెచ్చుకున్నారు.